గ్యాలరీ ఇలా.. మరి నీళ్లెలా?

బ్రిటీష్ కాలంలో నగరవాసుల దాహార్తిని తీర్చేందుకు ముడసర్లోవలో నిర్మించిన నీటి గ్యాలరీ మూలకు చేరుతోంది. గత పాలకుల దోపిడీ, అధికారుల నిర్లక్ష్యం వెరసి, సమీప ప్రాంత ప్రజలకు రోజు విడిచి రోజైనా చాలినంత నీరందించలేని స్థితికి చేరింది. రూ.లక్షల్లో జీవీఎంసీ నిధులు వెచ్చించినా.. మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది.

- పూడికతో పేరుకుపోయిన ముడసర్లోవ నీటి గ్యాలరీ
- రోజు విడిచి రోజు నీటి సరఫరాతో ఆరిలోవ ప్రజల ఇక్కట్లు


ముడసర్లోవ పార్కులో బురదతో పేరుకుపోయిన నీటి గ్యాలరీ

ఆరిలోవ : ముడసర్లోవ రిజర్వాయరు దిగువన విశాలమైన మైదానంలో సుమారు ఎకరం విస్తీర్ణంలో నీటి గ్యాలరీ నిర్మించారు. 1902లో బ్రిటిష్ అధికారులు నగరానికి నీటి సరఫరా కోసం దీన్ని నిర్మించి, దీని మధ్యలో 13 చోట్ల నూతులు తవ్వించారు. అనంతరం ఆ నూతుల చుట్టూ పార్కు నిర్మించారు. రిజర్వాయరులో నీరు ఆయా నూతుల్లోకి, గేలరీలోకి చేరేలా ఇంజినీరింగ్ పరిజ్ఞానాన్ని ఉపయోగించారు. ఈ గ్యాలరీలో నీరు వడకట్టి, పలు ప్రాంతాలకు సరఫరా చేసేవారు.

అరకొర నీటి సరఫరా

ప్రస్తుతం ఆరిలోవ ప్రాంతంలో నివాసాలు, జనాభా పెరగడంతో దీని ద్వారా నీటి సరఫరా తగ్గింది. ఇపుడు ఆపరేషన్ కాలనీ నుంచి దుర్గాబజార్ వరకు ఈ గ్యాలరీ నీటిని కొళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా తోటగరువు, బాలాజీ నగర్, రవీంద్రనగర్, ఆదర్శనగర్, డెయిరీఫారంతో పాటు హనుమంతవాక నుంచి దీన్‌దయాళ్‌పురం వరకు నీరందిస్తున్నారు. గ్యాలరీ అడుగు భాగంలో మట్టి భారీగా పేరుకుపోవడంతో గత కొద్ది రోజులుగా ఆశించిన మేరకు నీటి సరఫరా జరగట్లేదు. ముడసర్లోవ జలాశయం నుంచి పైప్‌లైన్ ద్వారా నీరు గ్యాలరీకి చేరుతుంది. ఈ పైప్‌లైన్‌కు ఏర్పాటు చేసిన ప్రధాన వాల్వ్ పాడవడంతో, నీరు భారీగా లీకై పార్కు బురదమయంగా మారుతోంది. గ్యాలరీలోకి అవసరమైన మేరకు నీరు చేరకపోవడంతో ఆరిలోవ ప్రాంతానికి సరిపడగా నీటి సరఫరా జరగట్లేదు.

మమ అనిపించేశారు!

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2017లో రూ.40 లక్షలతో ఈ గ్యాలరీ పనులు జరిపించారు. గోదావరి నదిలో గులకరాళ్లు తీసుకొచ్చి దీని అడుగు భాగంలో వేసి, దానిపై ఇసుక పొర వేసేందుకు నిర్ణయించారు. అయితే ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అనుచరుడు కావడంతో పర్యవేక్షణ కొరవడింది. దీంతో 15–20 ఏళ్లపాటు పూడిక ఇబ్బందులు రాకుండా జరపాల్సిన పనుల్లో నాణ్యత కొరవడి, నాలుగైదేళ్లకే గ్యాలరీ వడకట్టే సామర్థ్యం కనీస స్థాయికి పడిపోయింది. ప్రస్తుతం అడుగు భాగంలో మట్టి నిల్వలతో నీటి సరఫరా సామర్థ్యం క్షీణించి, స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు.

రెండు రోజులకోసారి నీరు


గ్యాలరీలో అవసరమైనంత మేరకు నీరు వడపోత జరగక, రెండు రోజులకోసారి కొళాయిలు వదులుతున్నారు. కొండవాలు ప్రాంతాలకు ట్యాంకర్లు ద్వారా జరుగుతున్న నీటి సరఫరాది కూడా ఇదే పరిస్థితి. అధికారులు స్పందించి ఇక్కడ గ్యాలరీలో మట్టి తొలగించి పూర్తి స్థాయి పనులు చేపట్టాలి.

– సీహెచ్ చిరంజీవి, ఆరిలోవ కాలనీ

వారంలో ఎప్పటిలాగే నీటి సరఫరా

వారం రోజుల్లో ఎప్పటిలాగే ప్రతిరోజూ కొళాయి నీరు అందిస్తాం. రెండు నెలల క్రితం ఇక్కడ అడుగు భాగంలో ఇసుక తొలగించే పనులు చేపట్టాం. ప్రస్తుతం రిజర్వాయరు నుంచి తక్కువ మోతాదులో నీటిని గ్యాలరీలోకి విడిచిపెడుతుండటంతో రోజూ నీటిని సరఫరా చేయలేకపోతున్నాం. రిజర్వాయర్ నుంచి గ్యాలరీకి నీటి సరఫరా చేసే పైప్‌లైన్ వాల్వు మరమ్మతులకు గురైంది. రిజర్వాయర్లో నిండుగా నీరుండటంతో ప్రస్తుతం దాన్ని బాగుచేయలేం. ఒకవేళ ప్రయత్నిస్తే రిజర్వాయరులో నీరంతా వృథాగా పోవాల్సిందే. రిజర్వాయరు పూర్తిగా అడుగంటితే వాల్వును మార్చేస్తాం.

– అప్పాజీ, ఏఈ, ముడసర్లోవ నీటి సరఫరా విభాగం, జీవీఎంసీ


ముడసర్లోవ పార్కులో మూలకు చేరిన ప్రెజర్ ఫిల్టర్లు

మూలకు చేరిన ప్రెజర్ ఫిల్టర్లు

రిజర్వాయర్ నుంచి వచ్చిన నీటిని ఎక్కువగా, తొందరగా వడపోత చేపట్టేలా ఎనిమిదేళ్ల క్రితం ఇక్కడ రెండు ప్రెజర్ ఫిల్టర్లు ఏర్పాటు చేశారు. వాటికి అప్పట్లో రూ.15 లక్షలు వెచ్చించారు. ఆ ఫిల్టర్ల పని తీరు మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. ఏడాది కూడా పనిచేయకుండానే మూలకు చేరాయి. వాటిని మరమ్మతు చేసేందుకు అధికారులు కనీస చర్యలు కూడా తీసుకోలేదు. జీవీఎంసీ నిధులు రూ.లక్షలు వెచ్చించినా, పనుల్లో నాణ్యత, అధికారుల పర్యవేక్షణ లేకే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎగ్జిబిషన్‌ను తిలకించిన చిన్నారులు


ఫిష్ టన్నెల్‌ను అబ్బురంగా తిలకిస్తున్న చిన్నారులు

ఏయూ క్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం మైదానంలో ఏర్పాటు చేసిన ఫిష్ టన్నెల్ ఎగ్జిబిషన్‌ను సోమవారం సాయంత్రం 35 మంది పేద కుటుంబాలకుచెందిన చిన్నారులు సందర్శించారు. శ్రీ మహాత్మా గాంధీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా సుమారు 35 మంది చిన్నారులను ఎగ్జిబిషన్‌లో ఉచిత ప్రవేశం కల్పించారు. సంఘం పాలకవర్గ సభ్యులు స్వయంగా చిన్నారులను ఎగ్జిబిషన్‌కు తీసుకువచ్చి, చూపించారు. నిర్వాహకులు రాజారెడ్డి చిన్నారులకు ఫిష్ టన్నెల్‌తో పాటు వివిధ రైడ్‌లు ఉచితంగా అందించారు.

యూజీడీ లీకేజీకి మరమ్మతులు

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీ 18వ వార్డు సెక్టార్-9లో యూజీడీ లైన్‌కు జీవీఎంసీ సిబ్బంది సోమవారం మరమ్మతులు చేపట్టారు. కొన్ని రోజులుగా ఇక్కడ యూజీడీ లైన్ లీకై, మురుగునీరు పైకి ఉబికి వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదు మేరకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. సోమవారం తవ్వకాలు చేపట్టి, మరమ్మతులు పూర్తి చేశారు.

క్లుప్తంగా

అలర్ట్ లఘుచిత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం థియేటర్ ఆర్ట్స్ విభాగం విద్యార్థి ఎం.నరేష్ కుమార్ చిత్రీకరించిన లఘుచిత్రం అలర్ట్ పోస్టర్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సైబర్ మోసాలు, సమాచార చోరీ తదితర అంశాలను ఇతివృత్తంగా తీసుకుని ప్రజలను చైతన్యవంతం చేసే దిశగా ఈ లఘు చిత్రాన్ని నిర్మించారు. కార్యక్రమంలో ఎం.ఎస్. సుందరరావు, పితాని ప్రసాద్, భార్గవ్, భవానీ ప్రసాద్, శ్యామ్ కుమార్, డాక్టర్ ఎస్.బల్ల తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ ముఖ ద్వారం ప్రారంభం


ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు, దసపల్లాహిల్స్‌లోని ముత్యాలమ్మ ఆలయానికి కొత్తగా నిర్మించిన ముఖద్వారాన్ని వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ సోమవారం ప్రారంభించారు. వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు సొంత నిధులతో నిర్మించిన ఈ ముఖద్వారంతో ఆలయానికి నూతన శోభ వచ్చింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అక్కరమాని వెంకటరావు పాల్గొని భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో 29వ వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు, రాపాక శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒడిశా బాధితులకు రక్తదానం


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్–2లోని ఏపీఎస్‌టీ ఐటీ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇటీవల ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో గాయపడిన వారి సహాయార్థం లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు డైరెక్టర్ తాజ్ అహ్మద్ తెలిపారు. సంస్థ ఉద్యోగులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. లయన్స్ బ్లడ్ బ్యాంకు ద్వారా బాధితుల అవసరానికి ఇక్కడ సేకరించిన రక్తాన్ని పంపించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ బ్లడ్ బ్యాంక్ చైర్మన్ దుర్గాప్రసాద్, లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల కోసం రెడ్ బౌల్ రెస్టారెంట్


రెస్టారెంట్‌ను ప్రారంభోత్సవంలో వరుణ్

బీచ్‌రోడ్డు : శర వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరానికి ఆసియా దేశాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారని నోవాటెల్ డైరెక్టర్ వరుణ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వారి అభిరుచులకు అనుగుణంగా నోవాటెల్ టెర్రస్‌పై రెడ్ బౌల్ రెస్టారెంట్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. తమ రెస్టారెంట్లో ఆసియా దేశాల్లో ప్రసిద్ధి చెందిన వంటకాలు లభిస్తాయన్నారు. ఆసియా దేశాల ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన రెస్టారెంట్, పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటుందన్న ధీమా వ్యక్తం చేశారు.

వాతావరణ, సముద్రశాస్త్రంపై శిక్షణ


శిక్షణకు హాజరైన వారితో ఆచార్యులు

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయ వాతావరణ, సముద్రశాస్త్ర విభాగం, ఎన్ఐటీ వరంగల్ సంయుక్త నిర్వహణలో వారం రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏయూ జీఎంఆర్ స్మార్ట్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించారు. శిక్షణ తరగతులకు వివిధ విశ్వవిద్యాలయాల నుంచి 36 మంది పరిశోధకులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎన్ఐటీ వరంగల్ సమన్వయకర్త జి.ఆర్.ఆర్.సంజీవిని, ఏయూ వాతావరణ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.సునీత తదితరులు ప్రసంగించారు. శిక్షణ తరగతుల్లో భాగంగా సముద్ర–వాతావరణ అంశాలలో తమ విభాగం ప్రగతిని వివరించారు. 11వ తేదీ వరకు ఈ ప్రత్యేక శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి.

పర్యావరణ పరిరక్షణ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రెక్టార్ ఆచార్య సమత

ఏయూక్యాంపస్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న పర్యావరణ పరిరక్షణకు 7 సూత్రాలు కార్యక్రమ పోస్టర్‌ను ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సోమవారం ఆవిష్కరించారు. ఏయూ జాతీయ సేవా పథకం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన కల్పించాలని సూచించారు. చెత్తను తగ్గించడం, విద్యుత్ ఆదా చేయడం, ఇ–వ్యర్థాలను తగ్గించడం, నీటి ఆదా, ఆరోగ్యకర జీవనశైలిని అలవరచుకోవడం, భరించ దగిన ఆహార విధానాలు ఎంచుకోవడం వంటి అంశాలతో ఈ పోస్టర్‌ను తీర్చిదిద్దారు. కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ శశిప్రభ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాల అందజేతలో వలంటీర్లు కీలకం


వలంటీర్లను సత్కరిస్తున్న అక్కరమాని తదితరులు

ఎంవీపీకాలనీ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల అన్నారు. 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య ఆధ్వర్యంలో, వార్డులోని ఆదర్శనగర్ కమ్యూనిటీ హాల్లో సోమవారం వలంటీర్ల సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆయన ఆకాంక్షకు అనుగుణంగా ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసి సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. నవరత్నాలను ప్రతి ఇంటికీ చేరవేస్తూ అందరి మన్ననలు పొందిందని కొనియాడారు. ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని ప్రతి ఇంటికి చేరవేయడంలో కీలకపాత్ర పోషించిందన్నారు. ఇలానే వలంటీర్లు రాబోయే రోజుల్లో కీలక సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గేదెల నాగరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

16 నుంచి యోగా సదస్సు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఏయూ యోగా కేంద్రం ఈ నెల 16, 17వ తేదీల్లో సదస్సు నిర్వహిస్తోంది. బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో జరిగే సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బెంగళూరుకు చెందిన ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ యోగిక్ సైన్సెస్‌తో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.తులసీరావు పాల్గొన్నారు.

ఘోషాస్పత్రికి లక్ష్య నేషనల్ సర్టిఫికెట్

మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏకైక ప్రసూతి ఆస్పత్రిగా పేరొందిన ప్రభుత్వ విక్టోరియా(ఘోషా) ఆస్పత్రి లేబర్ రూమ్ నాణ్యత అంశంలో లక్ష్య నేషనల్ సర్టిఫికెట్ పొందింది. 2017 డిసెంబర్‌లో లక్ష్య ప్రోగ్రాం ప్రారంభించింది. లేబర్ రూమ్‌లో మెరుగైన సంరక్షణతో పాటు నవజాత శిశువుల మరణాలను తగ్గించడం లక్ష్యంగా అమలు చేసిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి 70శాతం లక్ష్యాన్ని చేరుకుని, సర్టిఫికెట్ అర్హత సాధించిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషారాణి తెలిపారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అందించిన సహకారం వల్ల ఈ లక్ష్యాలు సాధించగలిగామన్నారు. దీని వల్ల మెడికల్ కాలేజీ, డిస్ట్రిక్ట్ ఆస్పత్రి నుంచి ప్రోత్సాహకాలు వస్తాయన్నారు. ఐఎస్ఆర్ నుంచి వరసగా 12 లక్షల రూపాయలు మంజూరు చేస్తారని తెలియజేశారు.

డీటీగా త్రినాథ్‌రావు బాధ్యతల స్వీకరణ


డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్‌రావు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎస్.ఎ.త్రినాథ్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో విశాఖ జిల్లా లోని అన్ని మండల కేంద్రాల్లో ఆయన పనిచేశారు. ఏపీఐఐసీలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్‌గా ఉన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయానికి డీటీగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన చేతన్‌కుమార్ మహారాణిపేట డీటీగా బదిలీపై వెళ్లారు.

ప్లాస్టిక్ రహితం.. పర్యావరణ హితం

మానవాళికి అత్యంత విలువైన ఆస్తి పర్యావరణం. మన భవిష్యత్తరాలకు అందించాల్సిన ఏకైక సంపద పర్యావరణం. దాన్ని కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యం. కాలుష్య కారక చర్యల్ని విడనాడుదాం.. మన వారసులకు కాలుష్య రహిత ప్రపంచాన్ని బహుమతిగా అందిద్దాం.. అంటూ వాడవాడలా ప్రకృతి ప్రేమికులు నినదించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలో చాలా చోట్ల మొక్కలు నాటారు.

- వాడవాడలా పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలు
- పలు చోట్ల మొక్కలు నాటిన ప్రముఖులు


తులసివనంలో మొక్కను నాటుతున్న ఏయూ వీసీ



మాట్లాడుతున్న మేయర్ హరివెంకట కుమారి


అరుదైన మొక్కలను నాటుతున్న ప్రజలు


సందర్శకులకు మొక్కలను అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు



జనశిక్షణా సంస్థాన్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు

ఏయూ క్యాంపస్ : ప్లాస్టిక్ రహితంగా, పర్యావరణహితంగా ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దనున్నట్టు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏయూ పరిపాలనా భవనం చేరువలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రావి, ఉసిరి, బాదం, పనస తదితర మొక్కలను నాటారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆచార్య పి.అర్జున్, ఆచార్య ఎన్.విజయ్ మోహన్, ఆచార్య అప్పల నాయుడు, ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి, ఆచార్య కె.బసవయ్య, సీఎస్‌వో మహ్మద్ ఖాన్, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలు పెంచుదాం

వర్సిటీలో వివిధ ప్రాంతాలలో ఔషధ మొక్కలను పెంచే దిశగా కృషి చేస్తున్నట్లు వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. సోమవారం ఏయూ అడ్వాన్స్‌డ్ సైన్స్ భవన్ చేరువలో ఏర్పాటు చేసిన తులసి వనంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో ఆచార్యులు, ఉద్యోగులు పాల్గొని పదుల సంఖ్యలో తులసి మొక్కలను నాటారు. ఇదే తరహాలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ త్వరలో భారీ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఏయూలో భారీ స్థాయిలో మొక్కల్ని నాటిన విషయాన్ని గుర్తించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, హార్టికల్చర్ డీన్ ఆచార్య జి.వీర్రాజు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, శ్రీధర్ బాబు, ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఛాతీ ఆస్పత్రిలో..

ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర మేయర్ జి.హరి వెంకట కుమారి మామిడి, నేరేడు, వేప, కానుగ తదితర జాతుల మొక్కలను ఆస్పత్రి సిబ్బందితో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ మనుగడ మొక్కలతో ముడిపడి ఉందన్నారు. వృక్ష సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, ఆస్పత్రి అభివృద్ధి మండలి సభ్యులు రూపాకుల రవికుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌సీడీ ఆస్పత్రి ఆవరణలో..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్‌సీడీ ఆస్పత్రి ఆవరణలోని జీవ వైవిధ్య ఉద్యానవనంలో వందకుపైగా అరుదైన మొక్కలను నగరవాసులు సోమవారం నాటారు. డాల్ఫిన్ నేచర్ క్లబ్ 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సీషోర్ వాకర్స్ క్లబ్ సభ్యులతో కలసి కర్పూర తులసి, లవంగ తులసి, రుద్ర తులసి, వస, పాషాణభేది, తిప్పతీగ, అడవిజీలకర్ర, నల్ల పసుపు తదితర మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్‌వీ మురళీ కృష్ణ, డాక్టర్ మంథా రామమూర్తి, ఆచార్య తిమ్మారెడ్డి, ఎం.వెంకటరావు, సి.వి.జోగారావు, ఎం.మంగతాయి, పద్మ, రంగారావు, శ్రీనివాసరెడ్డి, పోతన్న రెడ్డి, శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

బీచ్‌రోడ్డు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్కే బీచ్‌లో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని గీతం సంస్థల చైర్మన్ భరత్, అజీమా జహరామా ట్రస్టు చైర్మన్ అహ్మద్ అలీషాలు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్లాత్ బ్యాగ్‌లను, మొక్కలను సందర్శకులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ డాక్టర్ ఆనంద కుమార్, సభ్యులు పి.మంజుల, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.


రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తీరంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను వలంటీర్లు శుభ్రం చేశారు. ప్రజలంతా స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్ర రెడ్డి, డాక్టర్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డు: పర్యావరణ సమతుల్యతను పరిరక్షించడం అందరి బాధ్యత అని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు జీవీఎంసీతో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు కలిసి రావాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం పూర్తిగా నిషేధించాలన్నారు. మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షించాలని కోరారు. కాలుష్య నియంత్రణలో భాగంగా ప్రజా రవాణాను వినియోగించాలన్నారు. ఇంధన వాహనాలను కాకుండా విద్యుత్తుతో నడిచే వాహనాలను వినియోగించాలన్నారు. జీవీఎంసీ పరిధిలో కాలుష్యాన్ని తగ్గించేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యమైన సంస్థల ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సాధిక్, అధికారులు ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : పర్యావరణ పరిరక్షణతో మానవళి ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. పిఠాపురంకాలనీలోని జన శిక్షణా సంస్థాన్‌లో నిర్వహించిన పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి, వాటిని పెంచే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, జన శిక్షణా సంస్థాన్ అధ్యక్షుడు సి.ఎ.రామరాజు, ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారి కె.ఎల్.మనోహరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరంలో వాక్‌థాన్


వాక్‌థాన్‌లో పాల్గొన్న హెచ్‌పీసీఎల్ సిబ్బంది

బీచ్‌రోడ్డు : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో సాగరతీరంలో వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం మొక్కలు పంపిణీ చేసి తీరాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన హెచ్‌పీసీఎల్ ఈడీ వీరభద్రరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తొలగించడానికి అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. మెరుగైన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ అధికారులు సి.మురళీ కృష్ణ, బి.వి.వి.రాజు తదితరులు పాల్గొన్నారు.